ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



మహబూబ్‌నగర్

జిల్లా వార్తలు

సోమవారం 11 నవంబరు 2024

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 20.0

కురుమూర్తిలో జన జాతర

- బ్రహ్మోత్సవాలకు భారీగా తరలివచ్చిన భక్తులు
- దాసంగాలతో స్వామికి నైవేద్యం

7

డీసీసీబీ చైర్మన్‌లకు శిక్షణ తరగతులు

- మధురైకి వెళ్లిన ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి

7

అన్నను చంపిన తమ్ముడు

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..
- నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం రాళ్ల చెరువుతండాలో ఘటన

7

ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- క్వింటాలుకు రూ.2,320 మద్దతు ధర
- సన్నాలకు రూ.500 బోనస్
- రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి
- 'ఆంధ్రజ్యోతి'తో ఏడీఏ బి.వెంకటేశ్

6

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, తద్వారా మద్దతు ధరతోపాటు సన్నాలకు రూ.500 బోనస్ దక్కుతుందని అంటున్నారు మహబూబ్‌నగర్



వ్యవసాయ శాఖ అధికారి బి.వెంకటేశ్. ప్రైవేటుకు అమ్మి నష్టపోవద్దని చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 191 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెబుతున్న ఆయన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

- పాలమూరు, ఆంధ్రజ్యోతి

పెండింగ్ ప్రాజెక్టులన్నీ.. పూర్తి చేయిస్తా



ఎలివేటెడ్ కారిడార్‌తో కూడిన ఘాట్ రోడ్డు నిర్మాణం కోసం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే జీఎంఆర్, మంత్రి దామోదర రాజనరసింహ, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

- పాలమూరు జిల్లా పచ్చని పైర్లు.. పసిడి పంటలతో విలసిల్లాలి
- ప్రాజెక్టుల పూర్తి కోసం సమీక్షలు.. ప్రవాహంలా నిధులు
- త్వరలో మక్తల్, నారాయణపేట, కొడంగల్ లిఫ్టు పనులు ప్రారంభం
- ప్రతీ తండాకు బీటీ రోడ్డు.. కలెక్టర్లు నివేదికలు ఇవ్వాలి
- కురుమూర్తి, మన్యంకొండ దేవాలయాల అభివృద్ధికి అంచనాలివ్వండి
- పరిశ్రమలతో ఉపాధి..
- కురుమూర్తి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కొండపై రూ.110 కోట్లతో ఎలివేటెడ్ ఘాట్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం



సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో గత ప్రభుత్వం పదేళ్లుగా పెండింగ్‌లో ఉంచిన సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి.. ఈ జిల్లా పచ్చని పైర్లు, పసిడి పంటలతో విలసిల్లడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం పేదల తిరుపతి కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం హాజరయ్యారు. కొండపైకి వెళ్లేందుకు 3.7 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ ఘాట్ రోడ్డు నిర్మాణానికి(రూ.110 కోట్లతో) శంకుస్థాపన చేశారు. అనంతరం నేరుగా కొండపైకి వెళ్లి, స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆరు దశాబ్దాల తర్వాత పాలమూరుకు సీఎం అవకాశం దక్కిందని, దాన్ని వినియోగించుకుని అభివృద్ధి చేస్తానని తెలిపారు. పేదల తిరుపతిగా

(మిగతా 6లో..)



సీఎం ప్రసంగం వింటున్న భక్తులు

చాంపియన్ హైదరాబాద్

- రన్నర్ మహబూబ్‌నగర్, రంగారెడ్డి
- ముగిసిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల, బాలికల బాస్కెట్‌బాల్ టోర్నీ

6



రన్నర్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ బాలికల జట్టు

కోనేరులో జారిపడి యువకుడు మృతి

7

తరుగుకు ఇక చెక్

- అందుబాటులో ధాన్యం శుభ్రంచేసే యంత్రాలు
- వాటి వల్ల తరుగు నియంత్రణకు దోహదం
- నారాయణపేట జిల్లాలో 52 యంత్రాలు



నారాయణపేట మార్కెట్ యార్డులో వడ్లు శుభ్రం చేసే యంత్రాలు

నారాయణపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో శుభ్రం చేసేందుకు యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. ఈ యంత్రాలతో ధాన్యం శుభ్రం చేయడం వల్ల తరుగు నియంత్రణకు దోహదపడనుంది. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లాలోని మూడు మార్కెట్ యార్డులకుగాను 52 వడ్లు శుభ్రం చేసే యంత్రాలు వచ్చాయి. గత ఏడాది ఇవి వచ్చాయి. నారాయణపేట మార్కెట్ యార్డుకు 23 యంత్రాలు రాగా, వాటిని మార్కెట్ యార్డు పరిధిలోని మరికల్, ధన్వాడ, దామరగిద్ద, నారాయణపేట, ఊట్కూర్ మండలాల్లో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచనున్నారు. కోస్గి మార్కెట్ యార్డుకు 19 యంత్రాలు రాగా కోస్గి, మద్దూర్, కొత్తపల్లి, గుండుమల్ మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో, మక్తల్ మార్కెట్ యార్డుకు 13 రాగా.. మక్తల్, నర్వ, కృష్ణ, మాగనూర్ మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచనున్నారు. ధాన్యం ఈ యంత్రాల్లో వేసి, తూర్పుపట్టడం వల్ల తాలు, మట్టి పెడ్డలు వెళ్లిపోతాయి. అవి లేకపోవడంతో తరుగు తీయకుండా రైతులకు మేలు చేకూరు తుందని అధికారులు చెబుతున్నారు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 101 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, 96 కేంద్రాలను ప్రారంభించారు.

విద్యాశాఖ అధికారి ఎవరు?

- మహబూబ్‌నగర్ డీఈవోగా వచ్చేందుకు జంకుతున్న అధికారులు
- వికారాబాద్ డీఈవోకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చే చాన్స్?
- ఏసీబీకి పట్టుపడిన రవీందర్ అక్రమాలు ఒక్కోటిగా వెలుగులోకి..

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారిగా పని చేస్తున్న ఎ.రవీందర్ ఓ ఉపాధ్యాయురాలి సీనియారిటీ జాబితా విషయంలో రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుపడటంతో తర్వాత జిల్లా అధికారి ఎవరనే చర్చ జరుగుతోంది. రవీందర్ ఏసీబీకి పట్టుపడి నాలుగు రోజులు అయినా డీఈవోగా ఎవరిని నియమించ లేదు. దీంతో కార్యాలయంలో ముఖ్యమైన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పదో తరగతి విద్యార్థుల పరీక్షల ఫీజు చెల్లింపు తేదీ ఈ నెల 18 వరకు ఉంది. అందుకు డీఈవో అవసరం ఉంటుంది. 2008 డీఎస్సీ అభ్యర్థుల ఉమ్మడి జిల్లా ఫైల్ కూడా మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచే ముందుకు కదలాలి. మరికొన్ని ఫైళ్లపై డీఈవో సంతకం పెట్టాల్సి ఉంది. డీఈవో కార్యాలయ ఏడీకీ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తారని చర్చ సాగుతోంది. అయితే అందుకు సదరు అధికారి సుముఖంగా లేనట్టు తెలుస్తోంది. గతంలో డీఈవో బదిలీ అయినా సమయంలో ఏడీకీ ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలని అనుకోగా, తీసుకోకుండా సెలవుపై వెళ్లిన విషయం తెలిసిందే.

మళ్లీ ఇన్‌చార్జి డీఈవోనేనా?

మహబూబ్‌నగర్ ఉమ్మడి పాత జిల్లా. ఇక్కడ రెగ్యులర్ డీఈవో ఉండాలి. కానీ రెగ్యులర్ డీఈవోగా వచ్చేందుకు ఎవరూ మొగ్గు చూపకపోవడంతో మరోమారు ఇన్‌చార్జి డీఈవోకే బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జి డీఈవో గోవిందరాజులుకు గాని, వికారాబాద్ అధికారి రేణుకకు గాని లేదంటే డీఈవో కార్యాలయ ఏడీ అనసూయకు గాని ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. జిల్లాకు రెగ్యులర్ డీఈవో వస్తారా? లేక ఇన్‌చార్జి అధికారి వస్తారా? అనేది సోమవారం పాఠశాల విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది. నాగర్‌కర్నూల్ డీఈవో గోవిందరాజులుకు ఇప్పటికే నాగర్‌కర్నూల్‌తో పాటు వనపర్తి ఇన్‌చార్జి బాధ్యతలు ఉన్నాయి. దీంతో పాలమూరు జిల్లాకు పక్కనే ఉన్న వికారాబాద్ జిల్లా డీఈవోకు ఇన్‌చార్జి ఇస్తారని ప్రచారం సాగుతోంది.

జంకుతున్న అధికారులు

మహబూబ్‌నగర్‌కు రెగ్యులర్ డీఈవోగా వచ్చేందుకు ఎవరూ సుముఖంగా లేరని తెలుస్తోంది. ఇప్పటి వరకు ఇన్‌చార్జి డీఈవోగా పని చేసిన రవీందర్ మహబూబ్‌నగర్ డైట్ కళాశాల అధ్యాపకులుగా పని చేస్తూ, డీఈవో పోస్టు ఖాళీగా ఉండటంతో గత ప్రభుత్వ హయాంలో తనకున్న పరిచయాలతో ఇన్‌చార్జిగా వచ్చారు. అందుకు పెద్ద మొత్తంలో ఖర్చు చేసినట్లు ఆరోపణలు కూడా వచ్చాయి. వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో కూడా ఇన్‌చార్జిగా పని చేసినప్పుడు అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు వచ్చాయి. మహబూబ్‌నగర్ ఇన్‌చార్జి డీఈవోగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు విషయంలో భారీగా ముడుపులు తీసకున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆరోపించారు. సెక్టోరియల్ పోస్టుకు సంబంధించి ఓ ఉపాధ్యాయుడి నుంచి నేరుగా రూ.లక్షన్నర తీసుకున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మార్పు విషయంలో కూడా కీలకంగా వ్యవహరించారని ఓ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఓటరు జాబితాను ప్రదర్శించాలి



మక్తల్ బాలికల ఉన్నత పాఠశాలలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

మక్తల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతీ పోలింగ్ బూత్‌లో ఓటర్ల జాబితా తప్పకుండా ప్రదర్శించాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఆదివారం మక్తల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 158, 159, 160, 161, 163 పోలింగ్ బూత్‌లను కలెక్టర్ తనిఖీ చేశారు. ఓటర్ల జాబితాను ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపియన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని పోలింగ్ బూత్‌లలో ఓటర్ల జాబితాను తప్పకుండా ప్రదర్శించాలని బీఎల్‌వోలను ఆదేశించారు. ఓటరు జాబితాలో రెండు ఓట్లు ఉంటే వాటిని ఫారం 7 ద్వారా తొలగించాలని, మార్పులు ఉంటే ఫారం 8 ద్వారా సరి చేయాలని సూచించారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువత కొత్తగా ఫారం 6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటర్లు మరణించిన పక్షంలో వారిని జాబితా నుంచి తొలగించాలన్నారు. అంతకు ముందు కలెక్టర్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. సిబ్బంది సలహాలు, సూచనలు ఇస్తూ సర్వే పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మక్తల్ తహసీల్దార్ సతీష్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి జాన్ సుధాకర్, పుర కమిషనర్ భోగేశ్వర్లు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ డీఈవో విజయ్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యా విభాగం/టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ ఆశయాలను ప్రజలంతా ఆదర్శంగా తీసుకోవాలని రిటైర్డ్ డీఈవో విజయ్‌కుమార్ అన్నారు. నేటి యువత మహాత్మా గాంధీ ఆశయాలను ఆచరించాలనే సంకల్పంతో ఆయన చేపట్టిన సత్య శోధన పాదయాత్ర 40వ రోజు ఆదివారం మహబూబ్‌నగర్‌లోకి ప్రవేశించింది. స్థానిక క్లాక్ టవర్ దగ్గర మహాత్మాగాంధీ విగ్రహానికి విజయ్‌కుమార్ పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మహాత్మాగాంధీ చూపిన సత్యం, అహింస మార్గాలే యావత్తు ప్రపంచానికే ఆదర్శమన్నారు. నేటి యువకులు మత్తుకు బానిసలై, చెడు మార్గాల్లో నడుస్తున్నారని.. వారి బంగారు భవిష్యత్తు కోసం గాంధీజీ అనుసరించిన మార్గాలు దారి చూపుతాయన్నారు.



బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న డాక్టర్ వృషభ లింగేశ్వర బంతనాల మహాస్వాములు

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

కృష్ణ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలో బొడ్రాయి(నాభిశిల శీతలదేవి) ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలు చేపట్టగా చివరి రోజు బంతనాల మహాస్వామి డాక్టర్ వృషభలింగేశ్వర మాట్లాడుతూ 145 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం గొప్ప విషయమన్నారు. అనంతరం బొడ్రాయికి ప్రాణప్రతిష్ఠ చేశారు. అంతకు తెల్లవారుజామున క్షీరలింగేశ్వర మహాస్వాములు దేవాలయ ప్రాంగణంలో పంచామృత అభిషేకాలు, హోమం నిర్వహించారు. నాలుగు దిక్కుల నాలుగు బొడ్రాళ్లు ప్రతిష్ఠించి, పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించాలి

- ధాన్యానికి క్వింటాలుకు రూ.2,320 మద్దతు ధర
- సన్నాలకు రూ.500 బోనస్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పాలమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం వడ్లు సన్నాలకు ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు మద్దతు ధర రూ.2,320తో పాటు బోనస్ రూ.500 ప్రకటించిందని, ఆ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ మహబూబ్‌నగర్ ఏడీఏ బి.వెంకటేశ్ చెప్పారు. నిబంధనల మేరకు 15 శాతం తేమ ఉంటే మద్దతు ధర దక్కుతుందని, అదే ప్రైవేటు కొనుగోలు కేంద్రాలకు అమ్ముకుంటే నష్టపోతారని అన్నారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుంది? బోనస్ ఇస్తారా?

తాలు, చెత్త లేకుండా 15 శాతం లోపు తేమ ఉండే ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.2,320 మద్దతు ధర ఇస్తోంది. దాంతో పాటు క్వింటాలుపై రూ.500 బోనస్ ఇవ్వనుంది. అంటే రైతుకు క్వింటాలుకు రూ.2820 అందనుంది.

ఈ వానాకాలంలో ఎన్ని ఎకరాల్లో వరి సాగు చేశారు?

జిల్లాలో ఈ వానాకాలంలో లక్షా 94 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇప్పటికే వరి కోతలు ప్రారంభమయ్యాయి. దేవరకద్ర, చిన్న చింతకుంట మండలాల్లో రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారా?

ప్రభుత్వం తరఫున జిల్లాలో 191 ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాము. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే ధాన్యం తెచ్చి, మద్దతు ధర పొందాలి. 2.67 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

జిల్లా నుంచి ధాన్యం కర్ణాటకకు వెళ్తుందంటున్నారు? కారణమేంటి?

ప్రభుత్వం చెప్పిన నిబంధనలకు మేరకు లేని ధాన్యానికి మద్దతు ధర దక్కడం లేదు. అందుకే కొందరు రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్మకుండా ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వారు తక్కువ ధరకు కొంటున్నారు.

ఏఈవోలకు సమగ్ర కుటుంబ సర్వే నుంచి మినహాయింపు ఇచ్చారా?

ప్రస్తుతం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నందున ఏఈవోలు సమగ్ర కుటుంబ సర్వేకు వెళ్తే రైతులకు టోకెన్లు ఇవ్వటం సాధ్యం కాదు. అదే విషయాన్ని పైఅధికారులకు చెప్పాము. దాంతో అధికారులు ఏఈవోలకు మినహాయింపు ఇచ్చారు.

చాంపియన్ హైదరాబాద్

- రన్నర్ మహబూబ్‌నగర్, రంగారెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల, బాలికల బాస్కెట్‌బాల్ టోర్నీలో రెండు విభాగాల్లో హైదరాబాద్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బాలుర విభాగంలో రంగారెడ్డిపై హైదరాబాద్ జట్టు 56-28 తేడాతో, బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ హైదరాబాద్ జట్టు 50-23 స్కోర్ తేడాతో గెలిచి గెలుపొందాయి. బాలుర విభాగంలో రంగారెడ్డి, బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పాపిరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని చెప్పారు. క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో టోర్నీ రాష్ట్ర పరిశీలకులు గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు ముకర్రం, బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధులు అలీ, సుభాహన్‌జీ, షరీఫ్, కోచ్ ఖలీల్, వ్యాయమ ఉపాధ్యాయులు అరుణజ్యోతి, నాగరాజు పాల్గొన్నారు.



బాస్కెట్‌బాల్ చాంపియన్‌గా నిలిచిన హైదరాబాద్ బాలుర జట్టు



ఆలయంలోకి వెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



కురుమూర్తి ఆలయంలో పూజలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు



కురుమూర్తి ప్రధాన రహదారి గుండా వస్తున్న సీఎం కాన్వాయ్

పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయిస్తా

(మొదటి పేజీ తరువాయి)

పేరుగాంచిన కురుమూర్తిస్వామి 900 సంవత్సరాలుగా ఈ ప్రాంతవాసులకు ఇలవేల్పుగా ఉన్నారన్నారు. ఇక్కడికి వచ్చే భక్తుల్లో పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే జీఎంఆర్ తన దృష్టికి తెచ్చిన వెంటనే రూ.110 కోట్ల నిధులు మంజూరు చేశానని తెలిపారు. కురుమూర్తితోపాటు మన్నెంకొండ దేవాలయానికి నిధులు మంజూరు చేస్తానని, అంచనాలు రూపొందించి పంపాలని కలెక్టర్‌ను వేదికపై నుంచి ఆదేశించారు. అలాగే ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ దేవాలయాలతో పాటు.. మొదటి ప్రధాన మంత్రి పండిత్ నెహ్రూ చెప్పిన ఆధునిక దేవాలయాలైన సాగునీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఇక్కడి నుంచి తెలంగాణ వస్తుందని, అభివృద్ధి చెందుతామని భావించి.. కేసీఆర్‌ను గెలిపిస్తే, పదేళ్ల ముఖ్యమంత్రిగా ఉండి పట్టించుకోకపోవడం వల్ల ప్రాజెక్టులు పూర్తి కాలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న జూరాల, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు ప్రవాహంలా నిధులు విడుదల చేసి, పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో పర్యటించడం ఇబ్బందిగా ఉంటే.. సచివాలయంలో కూర్చుని పాలమూరు అభివృద్ధిపై సమీక్షలు చేస్తున్నానని అన్నారు. తనను సీఎం చేసిన జిల్లాను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. తలాపున కృష్ణమ్మ పారుతున్నా.. మక్తల్, నారాయణపేట, కొడంగల్ ప్రాంతాలు ఎడారిగా మారాయన్నారు. ఇప్పటికే లిఫ్టు మంజూరు చేసి.. టెండర్లు పూర్తిచేశామని, త్వరలో పనులు ప్రారంభించి బీడు భూముల్లో కృష్ణమ్మ పరవళ్లు తొక్కేలా చేస్తానన్నారు.

అన్యాయం చేస్తే చరిత్ర హీనులవుతారు

ఎడారిగా మారి ఎండిపోతున్న ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని చూస్తుంటే కొందరు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని సీఎం అన్నారు. ఈ జిల్లాకు అన్యాయం చేస్తే చరిత్ర హీనులవుతారని హెచ్చరించారు. జిల్లా ప్రాజెక్టులను అడ్డుకోవాలని చూస్తే యువకులు సహించబోరని తెలిపారు. కేసీఆర్‌ను ఈ ప్రాంత యువకులు పార్లమెంట్‌కు పంపించకపోతే, భుజాలపై మోయకపోతే ఆయన ఎక్కడ ఉండేవారని, ఆ కృతజ్ఞత మరిచిపోవద్దని అన్నారు. రాజకీయంగా మానుగడ సాధించడానికి, రాష్ట్ర సాధనలో ఉన్నారని చెప్పుకోవడానికి ఈ పాలమూరు జిల్లానే అవకాశం ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ ప్రాంతానికి బీఆర్ఎస్ హయాంలో నిధులు తేలేదని, సొంత నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకున్నా.. తాము ఏడ్వలేదని, బాధైన ఓర్చుకున్నామని అన్నారు. ఇప్పుడు తమకు అవకాశం వచ్చిందని, 12 మంది ఎమ్మెల్యేలను, ఒక ఎంపీని ఇచ్చి.. సీఎంను చేసిన జిల్లా అభివృద్ధి బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. జిల్లాలో అభివృద్ధిపై నిరంతరం సమీక్షలు జరుగుతున్నాయని అన్నారు. విద్య, ఉపాధి, వైద్య రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామని అన్నారు. ఇంజనీరింగ్, లా కాలేజీలను ఇటీవలే పాలమూరు యూనివర్సిటీకి అనుబంధంగా మంజూరు చేశామని గుర్తు చేశారు.

యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ

ఐటీ పరిశ్రమలతో మాట్లాడి.. వాటిని పాలమూరులో నెలకొల్పాలని కోరుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇప్పటికే ఉన్న అమర్‌రాజా కంపెనీ ప్రతినిధులతో ఉపాధి అవకాశాల కోసం మాట్లాడామని, 2 వేల మందికి ఉపాధి కల్పిస్తామని కంపెనీ అంగీకారం తెలిపిందన్నారు. ఈ ప్రాంతంలో యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించేలా ప్రోత్సహిస్తామని స్పష్టం చేశారు. అలాగే తండాలు, గూడేలు, మారుమూల కుగ్రామాలకు కూడా బీటీ రోడ్డు లేదనే పదం వినదలుచుకోలేదన్నారు. ఉమ్మడి జిల్లాలో అంచనాలు సిద్ధం చేసి, ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించి, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు నివేదికలు అందజేయాలని ఆదేశించారు. పాలమూరు ఆత్మగౌరవాన్ని అణచివేయాలని చూస్తే.. చెమట చుక్కల ప్రవాహంలో కొట్టుకుపోతారని తెలిపారు. కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, కలెక్టర్ విజయేందిర బోయి, మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి, స్వర్ణ సుధాకర్‌రెడ్డి, అమ్మాపూర్ సంస్థానాధీశులు శ్రీరాంభూపాల్, దేవాదాయశాఖ ఆర్‌జేసీ రామకృష్ణ, డీసీ కృష్ణప్రసాద్, ఈవో మదనేశ్వర్, ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు అరవింద్ కుమార్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, దేవరకద్ర మార్కెట్ చైర్మన్ కథలప్ప, నాయకులు వట్టెం శివ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే బ్రహ్మోత్సవాలకు రోడ్డు పూర్తి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



వెనుకబడ్డ పాలమూరు జిల్లాలో కూలీలు, పేదలు, వృద్ధులు తిరుపతికి వెళ్లే స్థోమత, అవకాశం లేక.. కురుమూర్తి జాతరకు వస్తారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటిరెడ్డి అన్నారు. 2009లోనే ఇక్కడ ఘాట్ రోడ్డు నిర్మించాలని అనుకున్నప్పటికీ.. అప్పటి ఆందోళనతో కాలేదన్నారు. ఇటీవల యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ శంకుస్థాపన సందర్భంగా ఘాట్ రోడ్డు కావాలని స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కోరడంతో కేవలం నెలరోజుల్లోపే రూ.110 కోట్లను సీఎం రేవంత్‌రెడ్డి మంజూరు చేయించారని తెలిపారు. వచ్చే బ్రహ్మోత్సవాల నాటికి ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో నిర్మాణం పూర్తిచేసి, అందుబాటులోకి తెస్తామన్నారు. ఎవరెన్ని మాటలు మాట్లాడినా.. తెలంగాణ ఇచ్చిన పార్టీగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.

సంక్షేమం.. అభివృద్ధి నినాదం: మంత్రి దామోదర రాజనర్సింహ



పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తిస్వామికి వందల సంవత్సరాల చరిత్ర ఉందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. కార్తీక మాసంలో నెల రోజులపాటు ఈ ప్రాంతంతోపాటు కర్ణాటక నుంచి కూడా భక్తులు హాజరై ఇలవేల్పుగా స్వామిని కొలుస్తారని చెప్పారు. ఈ క్షేత్రం ప్రాశస్త్యం ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని, ఇప్పుడు మంజూరు చేసిన రూ.110 కోట్లతోపాటు.. మరిన్ని వసతుల కోసం నిధులు మంజూరు చేస్తామని అన్నారు. ప్రజలందరి ఆశీస్సులతో ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి నినాదంగా పనిచేస్తోందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి అడుగులు వేస్తోందని తెలిపారు.

కల్యాణకట్ట, కాటేజీలు నిర్మించాలి: ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డి కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు మొదటిసారి వచ్చారని, అడిగిన వెంటనే వస్తానని చెప్పడంతోపాటు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.110 కోట్లు మంజూరు చేశారని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లా ప్రత్యక్ష దైవం, ఇంటి దేవుడు అయిన కుమూర్తిస్వామికి పేదల తిరుపతిగా పేరుతుందని, బ్రహ్మోత్సవాల సమయంలోనే కాకుండా ప్రతీ అమావాస్యకు భక్తులు ఇక్కడికి వస్తారని తెలిపారు. తెలంగాణ నుంచే కాకుండా కర్ణాటక నుంచీ భక్తులు వస్తారని, కల్యాణకట్ట, కాటేజీలు, కల్యాణ మండపం నిర్మించాలని, వాటికి మరో రూ.100 కోట్లు మంజూరు చేయాలని సీఎంను కోరారు.

జోరుగా ఆయిల్‌పామ్

- ప్రతీ ఏడాది పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- నాలుగేళ్లుగా రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 6,691ఎకరాల్లో సాగు

కందనూలు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాలోని రైతులు సాధారణ పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలే కాకుండా వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం కూడా పండ్లతోటలు, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నది. జిల్లా వ్యాప్తంగా రైతులు ఆయిల్‌పామ్ సాగువైపు దృష్టి సారించారు. అధికారులు పైలెట్ ప్రాజెక్టుగా నీటి వసతి ఉన్న రైతులను ఎంచుకొని సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఒక ఎకరం విస్తీర్ణంలో 50 నుంచి 57 మొక్కలు నాటాలని సూచించారు.

2020-21 సంవత్సరానికి గాను 57మంది రైతులను ఎంపిక చేసి 221 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టారు. సబ్సిడీ పోను రైతు ఒక్కో మొక్కకు రూ. 20 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వం వంద శాతం సబ్సిడీ కల్పిస్తుంది. బీసీలకు 90శాతం, ఓసీలకు 80శాతం సబ్సిడీతో బిందు సేద్యం పరికరాలు కూడా అందిస్తోంది. ఆయిల్‌పామ్ సాగు చేసిన రైతులకు మొక్కల సస్యరక్షణ కోసం ఎకరానికి ఏడాదికి రూ.4,200 అందిస్తుంది. భూమి 12 ఎకరాల 20 గుంటలలోపు ఉన్న రైతులు అర్హులుగా గుర్తించనున్నారు.

జిల్లా వ్యాప్తంగా సాగు విస్తీర్ణం

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,751 మంది రైతులతో 6,691 ఎకరాల్లో విస్తీర్ణంలో పంట సాగు చేయించారు. 2020-21 సంవత్సరంలో 57మంది రైతులను ఎంపిక చేసి 221 ఎకరాల్లో సాగు చేయించారు. 2022-23 సంవత్సరానికి గాను 760 మంది రైతులకు అవగాహన కల్పించి 3,057 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయించారు. 2023-24 సంవత్సరంలో 689 మంది రైతులకు అవగాహన కల్పించి 2,533 ఎకరాల్లో సాగు చేయించారు. 2024-25 సంవత్సరం లక్ష్యంగా 225 మంది రైతులకు అవగాహన కల్పించారు. 880 ఎకరాల్లో సాగు చేసేందుకు పూనుకున్నారు. నాలుగేళ్లుగా జిల్లా వ్యాప్తం గా 1,751 మంది రైతులు ద్వారా 6,691 ఎకరాల్లో విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు కృషి చేశారు.



ఆయిల్‌పామ్ సాగు గురించి తెలుసుకుంటున్న కలెక్టర్ బదావత్ సంతోష్ (ఫైల్)

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 1751 రైతులతో 6,691 ఎకరాల విస్తీర్ణంలో పంట సాగుకు చేయించాం. పంట అమ్ముకోవడానికి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, బీసీలకు 90శాతం, ఓసీలకు 80శాతం సబ్సిడీతో ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది.

- కన్న జగన్, ఉద్యాన పట్టు పరిశ్రమల జిల్లా అధికారి

హామీలు అమలు చేయాల్సిందే

- పేదల బాగు కాదు... దోపిడీ చేసేందుకే అప్పులు
- సీపీఎం జిల్లా మూడో మహాసభలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

వీపనగండ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వనపర్తి జిల్లా మూడో మహాసభలు జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అధ్యక్షతన నిర్వహించారు. మొదటగా వీపనగండ్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజా సమస్యల పోరాటంలో అమరులైన వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ కమ్యూనిజం లేకుంటే దేశ భవిష్యత్తు లేదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను అమలు చేస్తా నని, పది నెలల కాలంలో ఆడవారిని బస్సు ఎక్కించడం తప్పా.. ఏ హామీ నెరవేర్చ లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని, దేశ సంపదను అంబానీలకు దోచిపెడుతుందని, ప్రజలకు తాత్కాలిక ప్రయోజనాలు కలిగే పథకాలు చేపట్టి బూర్జువ పార్టీలు మోసం చేస్తున్నాయన్నారు. శాశ్వత పరిష్కారం చూపే ప్రభుత్వం కమ్యూనిస్టు ప్రభుత్వమని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదితరులు ఉన్నారు.

షెడ్యూల్‌కే పరిమితమైన గాలికుంటు వ్యాధి టీకాలు

ఉప్పునుంతల, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): ప్రతీఏటా మూగ జీవాలు రోగాలబారిన పడకుండా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో గ్రామాలలో జీవాలకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేసేందుకు జిల్లా ఉన్నతాధికారులు మండలాల వారీగా దిశా నిర్దేశం చేశారు. అందులో భాగంగా ఉప్పునుంతల మండలంలో అక్టోబరు 15 నుంచి నవంబరు 14 వరకు గ్రామాల వారీగా గాలికుంటు నివారణ టీకాల షెడ్యూల్ ఏర్పాటు చేశారు. అధికారులు షెడ్యూల్‌కే పరిమిత మయ్యారు తప్ప క్షేత్ర స్థాయిలో పర్యటించి మూగజీవాలకు వైద్యం చేసినట్లు ఎక్కడా కనిపించడం లేదు. వైద్యులు, సిబ్బంది తమ పశు వైద్యశాలలకే పరితమై అక్కడికి వచ్చే జీవాలకే వైద్యం చేస్తూ పబ్బం గడుపుతున్నారు. కార్యక్రమం మొదట్లో కొన్ని గ్రామాలలో జీవాలకు గాలికుంటు నివారణ టీకా లు వేశారు. మిగతా గ్రామాలలో టీకాలు వేయకుండా రికార్డులో నమోదు చేసుకుంటూ వాట్సాప్ ఫొటోలకు పరిమితమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మూగజీవాలకు షెడ్యూల్ ప్రకారం గ్రామాలలో వైద్య క్యాంపులు ఏర్పాటు చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

లక్షలు వెచ్చించారు.. లక్ష్యం మరిచారు

- నిరుపయోగంగా మారిన వ్యాధి నిర్ధారణ కేంద్రం



మన్ననూరులో నిర్మించి ప్రారంభించని డయాగ్నొస్టిక్ కేంద్రం

మన్ననూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి డయాగ్నొస్టిక్, ఈ-ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనే వెనుకబడిన నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరులోని పీహెచ్‌సీ ఆవరణలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ-ఆరోగ్య కేంద్రం, డయాగ్నొస్టిక్ కేంద్రం నిరుపయోగంగా మారాయి. పదేళ్ల క్రితం మన్ననూరు, లింగాల పీహెచ్‌సీల పరిధిలో టెలిమెడిసిన్ సేవల నిమిత్తం ఈ-ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ సామగ్రిని సమకూర్చకుండా వదిలేశారు. అనుకున్న లక్ష్యం నెరవేరక పోగా అత్యవసర వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులు నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. నల్లమల లోతట్టు ప్రాంతంలో నివసించే చెంచు, గిరిజనులకు మలేరియా, టైఫాయిడ్, డెంగీ, పసిరికలు, మధుమేహం, థైరాయిడ్, వంటి వ్యాధులను నిర్ధారించేందుకు మన్ననూరులో రూ.30 లక్షల వ్యయంతో బీఆర్ఎస్ హయాంలో డయాగ్నొస్టిక్ కేంద్రం భవనాన్ని నిర్మించి ప్రారంభించారు. కానీ ల్యాబ్ పరికరాలు, సిబ్బందిని నియమించకపోవడంతో నిరుపయోగంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధి కారం చేపట్టిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో డయగ్నోస్టిక్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. వాటిల్లో మన్ననూరు కేంద్రం పేరు ఉంది. కానీ ఇక్కడి వైద్యశాఖ అధికారులు ల్యాబ్ సామగ్రిని సమకూర్చకుండా జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల, ఆసుపత్రిలోనే డయాగ్నొస్టిక్ కేంద్రం నిర్వహిస్తున్నారు. దీంతో నల్లమల చెంచు గిరిజనులు జిల్లా కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలంటే దూరభారం, ఆర్థికభారం అవుతోందని స్థానికంగా ఉండే ప్రయివేట్ ల్యాబ్‌లలో పరీక్షలు చేయించుకుంటున్నారు. జిల్లా అధికారులు స్పందించి మన్న నూరులో వ్యాధినిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు కృషి చేయాలని చెంచులు కోరుతున్నారు.

ప్రైవేట్ ల్యాబుల్లోనే పరీక్షలు



అనారోగ్యానికి గురైన సందర్భాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ల్యాబ్ టెస్టులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు ల్యాబుల్లో పరీక్షలు చేయించుకుంటున్నాం. ప్రైవేట్ ల్యాబ్‌లలో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహించే సౌకర్యం కల్పించాలి.

- జెల్ల అంజమ్మ, మల్లాపూర్ పెంట

అందుబాటులో లేని వైద్యులు



అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళితే.. వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో పట్టణ కేంద్రాలకు వైద్య సేవల నిమిత్తం వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడే నాణ్యమైన వైద్యం అందించే ఏర్పాట్లు చేయాలి.

- బయ్యన్న, మల్లాపూర్ పెంట

నీరుగారిన లక్ష్యం

- హరితహారం మొక్కలను పడేసిన వైనం

బిజినేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం లక్షల్లో నిధులు ఖర్చు చేసి నర్సరీల్లో మొక్కలు పెంపకం చేప ట్టింది. పెంచిన మొక్కలను హరితహారం పథకంలో భాగంగా ఖాళీ ప్రదేశాలు, రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో, ప్రజల ఇళ్ల వద్ద, పొలంగట్ల వద్ద పెంచేందుకు అవసరమైన మొక్కల ను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుంది. నర్సరీల్లో మొక్కల పెంపకానికి అవసర మైన నిధులను డ్రా చేసుకున్న తర్వాత వాటిని గ్రామాల్లో నాటకుండా వదిలేశారు. ఎన్ఆర్ఈజీఎస్ కూలీలతో మొక్కల నాటేందుకు గుంతలు తీయించి అక్కడక్కడా మాత్రమే మొక్కలు నాటి మమ అని చేతులు దులుపుకున్నారని ప్రజలు విమర్శలు గుప్పించారు. ఆదివారం మీట్యా తండా సమీపంలోని కర్నె ప్రాజెక్టు యూటీ కాలువ సమీపంలో హరితహారం మొక్కలను దాదాపు రెండు ట్రాక్టర్ల వరకు తీసుకొచ్చి గుట్టల మధ్య పడేశారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మీట్యాతండా సమీపంలో నాటకుండా పారబోసిన మొక్కలు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనృసింహస్వామి రథోత్సవం

గద్వాల టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పెద్ద అగ్రహారం అహోబిల మఠం వద్ద లక్ష్మీనృసింహస్వామి రథోత్సవాన్ని ఆదివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసంలో జరిగే ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా స్వామివారి కల్యాణం నిర్వహించిన అర్చకులు, రథంలో స్వామివారి ఉత్సవ మూర్తులను ఉంచి ఊరేగింపు నిర్వహించారు. కౌన్సిలర్ బండల పాండు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెంకట్రాములు, సుభాష్ ఉన్నారు.

క్రైం కార్నర్

చేపల వేటకు వెళ్లి వల చుట్టుకుని..
మత్స్యకార్మికుడి మృతి


చేపల వేటకు వెళ్లి మృతి చెందిన మామిళ్ల చెన్నయ్య

జడ్చర్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి కుంటలో వేసిన వలకు కాళ్లు చుట్టుకుని మత్స్యకార్మికుడు మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి రెవెన్యూ శివారులోని కొత్తకుంటలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. చేపలు పట్టేందుకు శనివారం రాత్రి జడ్చర్ల మండలం కిష్టారం గ్రామానికి చెందిన మామిళ్ల చెన్నయ్య(55) కొత్తకుంటలో వల వేశాడు. వేసిన వలను తీ సేందుకు ఆదివారం తెల్లవారుజామున కొత్తకుంటకు వెళ్లిన చెన్నయ్య కాళ్ల కు వల చుట్టుకుంది. దీంతో కుంటలో మునిగి మృతి చెందాడు. అతడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

కోనేరులో జారిపడి యువకుడు..

చిన్నచింతకుంట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి వచ్చిన యువకుడు కోనేరులో స్నానం చేసేందుకు వెళ్లి కాలుజారి మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామ సమీపంలో గల కురుమూర్తి జాతరలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ శేకర్ తెలిపిన వివరాల మేరకు.. కురుమూర్తి వేంకటటేశ్వరస్వామి జాతరకు వచ్చిన దేవరకద్ర మండలం గద్దగూడెం గ్రామానికి చెందిన దొడ్డనరేష్ (27) ఆదివారం జాతర మైదానంలోని స్వామి వారి కోనేరులో స్నానం చేసేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కోనేరులో జారి, మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తల్లి సవారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి ..

కొత్తకోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండల కనిమెట్ట గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకున్నది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కనిమెట్ట గ్రామ సమీపంలోని ఫుడ్ పిరమిడ్ హోటల్ దగ్గర కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డు మీద పడిన వ్యక్తిపై పలు వాహనాలు వెళ్లాయి. శవం ఛిద్రం కావడంతో గుర్తు పట్టడానికి వీలు లేకుండా ఉండింది. మృతి చెందిన వ్యక్తి వయస్సు 45 నుంచి 50 సంవత్సరాలు ఉంటుంది. నీలిరంగు లైన్ కలర్ ఫుల్ షర్ట్, తెల్ల అడ్డపంచ, గ్రీన్ కలర్ డ్రాయర్ మొలతాడుకు తాళం చెవి ఉందని ఎస్సై తెలిపారు. ఛిద్రమైన శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కారు, మోటార్ సైకిల్ ఢీకొని..

కేటీదొడ్డి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండల పరిధిలోని నందిన్నెల మధ్య ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన చోటు చేసుకున్నది. గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కుచినెర్ల గ్రామానికి చెందిన చాకలి దేవప్ప(44) అనే వ్యక్తి కేటీ దొడ్డి నుంచి కుచినెర్ల గ్రామానికి మోటార్ బైక్‌పై వెళుతున్నాడు. అదే సమయంలో కొండాపురం గ్రామానికి చెందిన వ్యక్తులు రాయిచూర్ నుంచి కారులో స్వగ్రామానికి వస్తున్నారు. కేటీదొడ్డి-నందిన్నె గ్రామాల మధ్యలో కారు మోటార్ సైకిల్ ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో చాకలి దేవప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి పంచనామా నిర్వహించారు. మృతుడికి భార్య నలుగురు పిల్లలు ఉన్నారు.

అన్నను చంపిన తమ్ముడు

తిమ్మాజిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధానికి అడ్డు తొలగించేందుకు సొంత అన్ననే తమ్ముడు హత్య చేశాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల పరిధిలోని రాళ్ల చెరువుతండాలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాళ్ల చెరువుతండాకు చెందిన పాతావత్ పీరియ కుమార్తె రాజమ్మను గోపాల్ వివాహం చేసుకున్నాడు. ఇటీవల అన్న భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఆమెతో ఏర్పరుచుకున్న సంబంధం కారణంగా భార్యను తరచుగా కొట్టడం చేస్తుండేవాడు. గత నాలుగు రోజుల క్రితం భార్యను కొట్టి ఆమె తల్లి వద్దకు పంపించాడు. తన వివాహేతర సంబంధానికి అన్నను అడ్డు తొలగించుకోవడం కోసం పథకం పన్నాడు. అన్న భార్యతో పాటు ఆమె తల్లి సహకారంతో ఇంట్లో నిద్రిస్తున్న శ్రీను తలపై బలంగా కర్రతో కొట్టి గొంతు నులిమి చంపేశాడు. మృత దేహాన్ని గోపాల్ తన అత్త అయిన పాత్లావత్ లక్ష్మీ ఇంటి ముందు వేసి పారిపోవడాన్ని గమనించిన గ్రామస్థులు ఆమెకు సమాచారమిచ్చారు. దీంతో ఆమె ఈ విషయాన్ని పోలీసులకు ఫోన్‌ద్వారా చెప్పడంతో వారు అక్కడి కి చేరుకున్నారు. హత్యకు గోపాల్, అతడి అన్న భార్య, తల్లి కారణమని ఆమె ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేశామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ధరూర్ మెట్టు ప్రాంతంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని ధరూర్‌కు చెందిన ఎరుకలి రాముడుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధరూర్‌కు చెందిన ఎరుకలి రాముడు గద్వాల నుంచి బొలెరో వాహనంలో ఆదివారం ఉదయం 40 బస్తాల రేషన్ బియ్యాన్ని గద్వాల నుంచి రాయిచూర్‌కు తరలిస్తుండగా పట్టుకొని అతడిపై కేసు నమోదు చేయడంతో పాటు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో పెద్దపులి శాంతమ్మ(42) చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగనూల్ గ్రామానికి చెందిన పెద్దపులి అంజనేయులు శాంతమ్మ దంపతులు మధ్య కుటుంబ కలహాలలో జరగడంతో మనస్తాపానికి గురైన వివాహిత శాంతమ్మ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కల్వకుర్తిటౌన్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టివేసి వాటి యజమానులపై కేసులు నమోదు చేసిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని జీడిపల్లి గ్రామ శివారులో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్స్‌కు మూడు ఇసుకట్రాక్టర్లు ఎదురు పడగా వాటిని పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేవని కల్వకుర్తి పోలిస్‌స్టేషన్‌కు తరలించారు. యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

రెండేళ్లయినా..

- పెబ్బేరులో ఇళ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం జరిగేనా?
- ఎమ్మెల్యే మేఘారెడ్డి హామీపై ఆశలు
- వీధినపడిన బాధితులు

పెబ్బేరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దినదినాభివృద్ధి చెందుతున్న పెబ్బేరు పట్టణంలో మాస్టర్ ప్లాన్‌లో భాగంగా పెబ్బేరు చౌరస్తా నుంచి వనపర్తి రోడ్డు వైపు ఎస్సీ కాలనీ వరకు 80 అడుగుల వెడల్పు రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సీఆర్‌ఎఫ్ నిధుల నుంచి 15 కోట్ల రూపాయలు బీటీ రోడ్డు కోసం కంచిరావుపల్లి నుంచి సుభాష్ చౌరస్తా వరకు నిధులు మంజూరు చేశారు. దీంతోపాటు రెండు వైపులా డ్రైనేజీ నిర్మాణం, రూ. రెండు కోట్ల 80 లక్షలు మంజూరు చేయడంతో ఆ పనులకు టెండర్లు జరిగి ఏడాది కావస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. ఈ రోడ్డు వెడల్పు రెండు వైపులా దాదాపు 164 ఇళ్లు కోల్పోయి రెండేళ్లు కావస్తున్నా వారికి ఇచ్చిన హామీలు నేటికీ అమలు జరగలేదు. ఇందులో 49 మంది సర్వస్వం కోల్పోయి వీధినపడ్డారు. అయితే బాధితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం, నష్టపరిహారం చెల్లించడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహించడంతో రోడ్డు పనులు కావడం లేదు. బాధితుల కోసం ఇళ్ల స్థలా లకు అనువైన భూమి ఉన్న వారికి పట్టాలు ఇచ్చే వారుకరువయ్యారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అనే చందంగా పరిస్థితి ఉంది. పట్టణంలో బాధితులకు కావలసిన స్థలం ఉన్న వారికి పట్టాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో పెబ్బేరు పట్టణంలో రహదారి అధ్వానంగా తయారైంది ఇళ్ల బాధితులు వీధినపడాల్సి వచ్చింది. అధ్వానంగా రోడ్డు తయారు కావడంతో ప్రమాదాలు, దుమ్ము ధూళితో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురై ఆసుపత్రి పాలవుతున్నారు.

ఇటీవల ఎమ్మెల్యే మేఘారెడ్డి ఇళ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కానీ తమకు ఇంటి స్థలాల పట్టాలు ఇచ్చిన తరువాతనే రోడ్డు పనులు చేపట్టాలని బాధితులు చెప్పారు. ఇంకా దాదాపు 16 మంది ఇళ్లను తొలగించలేదు. వీరికి రాజకీయ నాయకుల అండదండలు ఉన్నట్లు తెలుస్తోంది.


పెబ్బేరులో ఇల్లు కూలిపోయిన బాధితులతో ఇటీవల మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అవసరమైన భూమి పట్టణంలో ఉంది



పెబ్బేరు - వనపర్తి రహదారి వెడల్పులో ఇల్లు కోల్పోయిన వారికి కావలసిన భూమి పట్టణంలో ఉందని, ఆ భూమిలో ఇళ్లు కోల్పోయిన వారికి స్థలాల కోసం కలెక్టర్‌తో ఎమ్మెల్యే ప్రయత్నం చేసి వారికి ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలి. లేనిపక్షంలో బాధితుల తరఫున తాము ఆందోళన చేస్తాం. ఆ భూమి ఇవ్వడానికి మునిసిపాలిటీ తీర్మానం చేస్తుంది. ఇటీవల ఎమ్మెల్యే ఏకపక్షంగా బాధితులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా మునిసిపాలిటీ పాలకవర్గం అధికారుల సమక్షంలో బాధితులకు న్యాయం చేయాలి.

● కరుణశ్రీ, మునిసిపల్ చైర్ పర్సన్, పెబ్బేరు


పెబ్బేరు రోడ్డు వెడల్పులో కూలగొట్టిన ఇళ్లు

బాధితులను మోసం చేసిన గత ప్రభుత్వ నాయకులు



ఏడాది క్రితం ఇళ్లను తొలగించే సమయంలో బాధితులకు అప్పటి పాలకులు మాయమాటలు చెప్పి మోసం చేశారు. ఇప్పటికి ఇంటి స్థలాలు ఇవ్వలేదు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం పాలకులు అనువైన స్థలాలు ఇచ్చి ఆదుకోవాలి. తాము అద్దె ఇళ్లల్లో ఉన్నాం. పట్టాలు ఇచ్చిన తరువాతనే రోడ్డు పనులు చేపట్టాలి.

● ఎండీ నిజాం, బాధితుడు, పెబ్బేరు

కురుమూర్తిలో జనజాతర

- భారీగా తరలివచ్చిన భక్తులు
- దాసంగాలతో స్వామి వారికి మొక్కులు

చిన్నచింతకుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తి వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం జాతర మైదానంతో పాటుగా స్వామి మెట్లదారి భక్తులతో కిక్కిరిసిపోయింది. ఎటు చూసినా భక్తుల రద్దీతో జాతర మైదానం అంతా సందడిగా మారింది. సీఎం రాక సందర్భంగా భక్తులకు వారి దర్శనాలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మైదానంలోనూ జనజాతర కన్పించింది. వివిధ రకాల గాజులు, లేడీస్‌కార్నర్‌లు, రంగుల రాట్నాలు, ఇంకా అనేక రకాల దుకాణాలు కొనుగోలుదారులతో సందడి నెలకొంది. కాగా పవిత్ర కోనేరులో భక్తులు స్నానాలు చేసి, స్వామి వారికి ప్రత్యేకమైన పచ్చిపులుసు, మట్టికుండల్లో అన్నం వండి దాసంగాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో వివిధ రకాల సర్కస్‌లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.


స్వామి వారిని దర్శించుకునేందుకు వెళ్తున్న భక్తులు


వాహనాల్లో జాతరకు వస్తున్న భక్తులు


జాతరలో ఎద్దులకు కావాల్సిన సామగ్రి దుకాణం


జాతరలో స్టీలు సామాన్ల దుకాణం

నాబార్డు ఆధ్వర్యంలో
డీసీసీబీ చైర్మన్‌లకు శిక్షణ తరగతులు

- మధురైకి వెళ్లిన ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి

కొల్లాపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాబార్డు వారి సౌజన్యంతో తమిళనాడు రాష్ట్రం మధురై నగరంలో దక్షిణ భారతదేశ వ్యాప్తంగా ఉన్న డీసీసీబీ చైర్మన్లు, డైరెక్టర్లకు రెండు రోజుల పాటు (ఈ నెల 11, 12వ తేదీలలో) శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ శిక్షణ తరగతుల్లో దక్షిణ భారతదేశ వ్యాప్తంగా కేవలం 32 మందికి మాత్రమే అవకాశం దక్కింది. అందులో తెలంగాణ నుంచి ఉమ్మడి పాలమూరు జిల్లా డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి సారథ్యంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్లు భూపాల్‌రావు, గంప వెంకటేష్, రంగారెడ్డి కూడా ఆదివారం మధురైకి బయలుదేరారు. ఈ రెండు రోజుల శిక్షణ తరగతుల్లో డీసీసీబీ నుంచి రైతులకు ఏ విధంగా సేవలు అందించాల్సిన విధానంపై నాబార్డు డీసీసీబీలకు శిక్షణతో పాటు సెమినార్ నిర్వహించింది. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ... ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉమ్మడి జిల్లా రైతులకు సూచనలు, సలహాలు చేస్తూ డీసీసీబీ ఆధ్వర్యంలో సేవలు అందిస్తామన్నారు.


మధురైలో నాబార్డు శిక్షణ తరగతులకు వెళ్తున్న ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

- భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం

గద్వాల టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గద్వాల తిరుపతిగా పేరుగాంచి నదీఅగ్రహారం శ్రీ కల్యాణ లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఆదివారం రాత్రి శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నెలరోజుల పాటు సాగే వివిధ ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పుణ్యాహవచనం, రుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణం, గోవిందనామ స్మరణ శాస్త్రోక్తంగా సాగాయి.

అనంతరం కృష్ణా నదీతీరం వద్ద గంగా హారతిని నిర్వ హించిన భక్తులు ఆలయ ప్రాంగణంలో రా త్రి కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో పూర్తిచేశారు. అనంతరం మహా మంగళహారతి నిర్వహించిన అర్చకులు కార్తీక మాసంలో నిర్వహించే శివ రుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణానికి ఉన్న విశిష్టతను వివరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.


రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు


నదీఅగ్రహారం వేంకటేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాష్ట్ర స్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

- ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి అన్నారు. మేడ్చల్‌లో నేటి నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 రగ్బీ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల,బాలికల జట్లు తరలివెళ్లాయి. ఆదివారం స్థానిక స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జట్టును అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని, ఎంతో మంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారని గుర్తుచేశారు. టోర్నీ ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు జిల్లా క్రీడాకారులు ఎంపిక కావాలన్నారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం (పేటటీఎస్) జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, నిరంజన్‌రావు, నర్సింహులు పాల్గొన్నారు.


ఉమ్మడి జిల్లా అండర్-17 రగ్బీ బాల బాలికల జట్లు

సోమశిలలో కార్తీక శోభ

- ఆలయాన్ని సందర్శించిన పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ కార్యదర్శి భారతి లక్పతి నాయక్
- శివలింగానికి వెండితో తయారు చేయించిన శివుడి రూపాన్ని ధరింపజేసిన ఆలయ కమిటీ

కొల్లాపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామంలో ఆదివారం కార్తీక శోభ సంతరించుకుంది. రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు సోమశిల గ్రామంలో లలితాంబిక సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ సెక్రటరీ భారతి లక్పతి నాయక్ లలితాంబిక సోమేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ గోవింద్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఆమెను శాలువాతో సన్మానించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమేశ్వరాలయంలో భక్తులకు దర్శనమిచ్చే శివలింగానికి వెండితో తయారు చేయించిన శివుడి రూపాన్ని భారతి లక్పతి నాయక్, ఆలయ కమిటీ చైర్మన్ గోవింద్ రెడ్డిలు ధరింపజేశారు. కార్తీక మాసం సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో ఆలయంలో దీపార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రామ్మోహన్, కేతూరి వెంకటస్వామి, కేతూరి రామస్వామి, అంజన్న, గొల్ల గోపాల్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బాల్‌రెడ్డి పాల్గొన్నారు.


లింగానికి వెండితో తయారు చేయించిన శివుడి రూపాన్ని ధరింపజేస్తున్న భారతి లక్పతినాయక్


సోమశిల లలితాంబిక సోమేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఇంటర్వ్యూ..



అభివృద్ధి పనులకు ఆటంకాలు లేవు

- స్వామి, పంచాయతీరాజ్ శాఖ మండల ఏఈ

భూత్పూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు లేవని, రోడ్లు, ఇతర అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల అవుతున్నాయని పంచాయతీరాజ్ శాఖ ఏఈ స్వామి తెలిపారు. ఆదివారం ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు పథకాల పనుల గురించి వివరించారు.

ప్రభుత్వ పథకాలకు నిధుల విడుదలలో జాప్యం అవుతోందని కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు అంటున్నారు ఎందుకు?

కొన్నినెలలుగా బిల్లులు ఆగిన విషయం నిజమే. ప్రస్తుతం నిధులు విడుదల అవుతున్నాయి. గ్రామ పంచాయతీ భవనాల బిల్లులు, సీసీరోడ్ల బిల్లులు వచ్చాయి. ఉపాధిహామీ పథకం ద్వారా చేసిన పనుల బిల్లులు వచ్చాయి. బిల్లులు ఇంకా కొన్ని రావాల్సి ఉంది.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు ఎంత వరకు పూర్తయ్యాయి?

ఈ పనులు 25శాతం పనులు పూర్తయ్యాయి. ఇంకా 25శాతం పనులు వివిధ దశల్లో ఉన్నాయి. నిధులు కూడా వస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల భవనాలు పూర్తయ్యాయి. బిల్లులు కూడా విడుదల అయ్యాయి.

తాటికొండ,పోతులమడుగు రోడ్లు అసంపూర్తిగా ఉన్నాయెందుకు?

తాటికొండ బీటీరోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. పోతులమడుగు మీదుగా మదిగట్ల వెళ్లే రోడ్డు అసంపూర్తిగా ఉంది. త్వరలో పనులు చేయిస్తాం. బ్రిడ్జి పనులు పూర్తయ్యాయి ఈరోడ్డు పనులకు స్పెషల్ అధికారులు ఉన్నారు. వారి దగ్గర పూర్తి వివరాలు ఉన్నాయి.

న్యూస్ బాక్స్

ఉసిరి చెట్టు వద్ద వన భోజనాలు



దేవరకద్ర శివారులో ఉసిరిచెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

దేవరకద్ర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా ఆదివారం పట్టణంలోని పెద్దచెరువు వద్ద ఆంజనేయస్వామి గుట్ట దగ్గర ఉసిరిచెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి, వనభోజనాలు చేశారు.

కోయిల్‌సాగర్ నీటిమట్టం 31.5 అడుగులు

దేవరకద్ర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మధ్య తరహా కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 31.5 అడుగులకు చేరిందని ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిసామర్థ్యం 32.6 అడుగులు. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా సాగునీటి విడుదలను నిలిపివేశారు. జిల్లాకేంద్రానికి తాగునీటి సరఫరా కొనసాగిస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

మిడ్జిల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు ఆదివారం తెలిపారు. ఆ వివరాలు.. మిడ్జిల్‌కు చెందిన కోళ్ల శ్రీను(50) ఈనెల 7వ తేదీ గురువారం తెల్లవారు జామున ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో శ్రీను భార్య మౌనివి జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

నేడు మండలానికి బీజేపీ రాష్ట్ర బృందం

మిడ్జిల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగొమ్ముల, మున్ననూరు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం బీజేపీ రాష్ట్ర బృందం సభ్యులు పరిశీలించనున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ ఆదివారం తెలిపారు. ఎంపీ డీకే అరుణ, నాయకులు పోతుగంటి రాములు, చింతల రామచంద్రారెడ్డి, నాగురావు నామాజీ, పాపయ్యగౌడ్, పలువురు కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు.

నేటి నుంచి 10వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు

జడ్చర్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మండలం చిట్టబోయిన్‌పల్లిలోని బాలికల సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈనెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు 10వ జోన్‌స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అనిత ఆదివారం ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలోని ఎనిమిది బాలికల సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు 680 మంది పాల్గొంటారని పేర్కొన్నారు. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాలలో 11రకాల క్రీడా పోటీలు జరుగనున్నాయని తెలిపారు. అథ్లెటిక్స్, లాంగ్‌జంప్, హైజంప్, టెన్నికాయిట్, వాలీబాల్, ఖో-ఖో, హ్యాండ్‌బాల్, బాల్‌బాడ్మింటన్, కబడ్డీ, చెస్, క్యారమ్స్ పోటీలు జరుగనున్నాయని వివరించారు. ఈనెల 14న ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

కుటీర పరిశ్రమగా కృత్రిమ ఇసుక తయారీ



రాందాసు చెరువుతండా వద్ద ట్రాక్టర్‌లో మట్టిని ఫిల్టర్ చేసి ఇసుకగా తయారు చేస్తున్న వ్యక్తి



రాందాసుతండా చెరువులో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటారు



రాందాసుతండా చెరువు సమీపంలో ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రం

- అడ్డాలుగా నల్లగుట్ట, రాందాస్‌చెరువు తండాలు
- జిల్లా కేంద్రం సమీపంలో కేంద్రాల ఏర్పాటుతో మాఫియా జోరు

భూత్పూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏవ్యాపారం చేయాలన్నా ప్రభుత్వం నుంచి, సంబంధిత శాఖల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ కొందరు ఎలాంటి అనుమతులు లేకుండానే యథేచ్ఛగా కుటీర పరిశ్రమ మాదిరిగా ఏర్పాటు చేసుకొని లక్షల్లో కాసులు కూడబెట్టుకుంటున్నారు. మండలంలో ఇసుక మాఫియా తీరిది. దీనిని ఎవరైనా ప్రశ్నించినా, అడ్డుపడి నా దాడులకు పాల్పడుతున్నారు.భూత్పూర్ మునిసిపాలిటీ కేంద్రంలోని నల్లగు ట్ట, రాందాసుచెరువు తండాల పరిసరాల్లో ఇసుక ఫిల్టర్ల తయారీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారుల కనుసైగల్లో ఈ వ్యాపారం మూడుపువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతున్నాయి. ప్రతి రోజు వందల టన్నుల్లో కృత్రిమ ఇసుక జిల్లా కేంద్రానికి సరఫరా చేస్తూ రూ.లక్షల్లో కాసులు కూడబెట్టుకుంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి మట్టిని తెచ్చి స్థానికంగా ఉన్న చెరువుల్లో, బోరు బావుల వద్ద కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్నారు. రాత్రి సమయాల్లో భారత్‌బెంజ్ వంటి భారీ వాహనాల్లో, ట్రాక్టర్లల్లో జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు. రాందాసు తండాసమీపంలో ఉన్న చెరువులో నీటిని వాడుకొని ట్రాక్టర్ల ద్వారా తెచ్చిన మట్టిని శుభ్రం చేస్తారు. దీనితో చెరువునీరు కలుషితమవుతున్నాయి. చేపలు చనిపోయే పరిస్థితి ఏర్పడిందని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ చౌర్యం

వ్యవసాయ బావులకు ఉన్న విద్యుత్ కనెక్షన్లను కృత్రిమ ఇసుక తయారీకి వాడుకుంటున్నారు. ఈ విషయం విద్యుత్ శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకో వడం లేదు.

వాల్టా చట్టానికి తూట్లు

ప్రతి రోజు వేలాది టన్నుల కృత్రిమ ఇసుకను తాయారు చేసి సొమ్ము చేసుకుంటున్న ఇసుక మాఫియా వాల్టా చట్టం నిబంధనలను విస్మరిస్తున్నారు. ఈ దందా గురించి తెలిసినప్పటికీ రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు నోరు మెదపడంలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు ముకుమ్మడిగా అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మోసపోతున్న గృహ నిర్మాణదారులు

ఇంటి నిర్మాణాలకు ఇసుకను కొనుగోలు చేస్తున్న వారు కృత్రిమ ఇసుక తయారీ మాఫియా చేతుల్లో మోసపోతున్నారు. వాగునుంచి ఇప్పుడే తెచ్చామని చెబుతూ డబ్బులు పెద్దమొత్తంలో దండుకుంటున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.6వేల నుంచి 10వేల వరకు విక్రయిస్తున్నారు. టిప్పర్ ఇసుకను రూ.20 నుంచి 35వేల వరకు విక్రయిస్తున్నారు. దీనివల్ల భవిష్యత్‌లో నిర్మాణా ల్లో ఇబ్బందులు తలెత్తనున్నాయి.

కుంటలు, గుట్టలు గుల్ల

కృత్రిమ ఇసుక తయారీకి ముడి సరుకుగా గుట్టలు, చెరువులను వాడుతున్నారు. నల్లగుట్ట మట్టిని తరలించి గుట్టను కరగదీశారు. అమిస్తాపూర్, హస్నాపూర్, పోతులమడుగు, భూత్పూర్ ప్రాంతాల్లో గుట్టలనుంచి మట్టిని తరలించారు. ఆదివారం, ఇతర ప్రభుత్వ సెలవురోజుల్లో ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తున్నారు. ఈవిషయమై ఎస్‌ఐ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా కృత్రిమ ఇసుక తయారీ కేంద్రాల విషయం మా దృష్టికి రాలేదన్నారు. ఇసుక, మట్టి తరలింపును రెవెన్యూ అధికారులు చూడాల్సి ఉంటుంది. మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు ఎవరైనా పిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాము.

వెంకటేశ్వరకాలనీ అభివృద్ధికి కృషి

మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

మహబూబ్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఒకటో వార్డు వెంకటేశ్వరకాలనీ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన వార్డు విజిట్‌లో భాగంగా వెంకటేశ్వర కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు డ్రైనేజీ, సీసీరోడ్ల గురించి వివరించారు. వెంటనే అత్యవసర పనులను గుర్తించి ప్రతిపాదనలు తయారు చేయిస్తామని, పనులు కూడా వీలైనంత త్వరలో చేపడతామని తెలిపారు. పాలమూరు పురపాలికలో ఎన్నో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ విడతల వారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రోజా తిరుమలవెంకటేశ్, మాజీ కౌన్సిలర్ గంజి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర

భూత్పూర్/దేవరకద్ర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్కిచర్ల, భూ త్పూర్ గ్రామాల్లో ఆదివారం మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం సూచించిన మేరకు ధాన్యాన్ని శుభ్రంగా తేమ లేకుండా, చెత్తాచెదారం వంటివి లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని మోసపోవ ద్దని రైతులకు సింగిల్ విండో చైర్మన్ అశోక్‌రెడ్డి సూచించారు. ధాన్యం అమ్మిన తర్వాత 48గంటల్లో ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నగదును జమ చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రైతులకు భరోసానిచ్చారు. దళారుల మాటలు నమ్మి రైతులు ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించవద్దని అన్నారు. అనంతరం రైతులకు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో సీఈవో రత్నయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలవర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రావు, గోవర్ధన్ గౌడ్, బోరింగ్ నర్సిములు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



వెల్కిచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సింగిల్‌విండో చైర్మన్ అశోక్‌రెడ్డి

గోపన్‌పల్లిలో కేంద్రం ప్రారంభం

దేవరకద్ర: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సింగిల్‌విండో చైర్మన్ నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం గోపన్‌పల్లిలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం విక్రయించిన 48గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. కార్యక్రమం లో నాయకులు పాల్గొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న ఆలయ కమిటీ

మూసాపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకలమద్ది శివారు సర్వే నెంబర్ 483 ప్రభుత్వ గుట్ట(రామస్వామిగుట్ట)లో మొర్రం మట్టి తరలింపును ఆదివారం ఆలయ కమిటీ సభ్యుల, గ్రామస్థులు అడ్డుకున్నారు. జాతీయ రహదారి రోడ్డు నిర్మాణం కోసం గుత్తేదారులు రామస్వామి గుట్ట నుంచి మోరం మట్టిని తరలించడానికి ప్రొక్లెయిన్, హిటాచీ వాహనాలతో మట్టిని తవ్వుతుండగా రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు అస్కని నరేందర్‌సాగర్, నాయకులు, అశోక్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నగేష్, మల్లికార్జున్, వెంకటేశ్, రాజేందర్ అక్కడికి చేరుకుని తరలింపును అడ్డుకున్నారు. ఇది రామస్వామి ఆలయ గుట్ట ఎంతో ప్రకృతి రమణీయమైన సంపద ఉందని, ఇక్కడి నుంచి తరలిస్తే ఎంతో శ్రమపడి వేసిన సీసీరోడ్డు పూర్తిగా పాడైపోతుందని, ఈ విషయాన్ని కూడా ప్రాజెక్టు మేనేజర్‌కు సూచించామని గుత్తేదారులతో వాగ్వాదానికి దిగారు.

ఈ విషయంలో సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.



రామస్వామి గుట్టలో మట్టి తరలింపును అడ్డుకున్న ఆలయ కమిటీ సభ్యులు

రెండో రోజూ కొనసాగిన సర్వే

మిడ్జిల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండవ రోజు అధికారులు సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమాన్ని సూపర్‌వైజర్లు పర్యవేక్షించారు. వెలుగొమ్ముల గ్రామంలోని నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని పీఆర్ఏఈ, సూపర్‌వైజర్ ఆశ్వత్‌రాయ్ పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశ్రీ, ఎన్యుమరేటర్ శ్రావణ్‌కుమార్‌తో పాటు తదితరులున్నారు.

ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలి

దేవరకద్ర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రావు కోరారు. ఆదివారం రెండోరోజు కుటుంబ సర్వేను పరిశీలించి, పక్కాగా వివరాలు నమోదు చేయాలని సర్వే అధికారులకు సూచించారు.

ధర్మ సంరక్షణకు సిద్ధం కావాలి

బజరంగ్‌దళ్ ప్రాంత సహ సంయోజక్ వెంకటేశ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఎక్కడ అధర్మం రాజ్యమేలుతుందో అక్కడ బజరంగ్‌దళ్ కార్యకర్తలు ధర్మసంరక్షణకు పాటు పడాలని బజరంగ్‌దళ్ ప్రాంత సహ సంయోజక్ వెంకటేశ్ పిలుపునిచ్చారు. అయోధ్య రామమందిర నిర్మాణ క్రమంలో ప్రాణాలర్పించిన వారి ఆత్మశాంతి కోసం జిల్లా కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో మహాత్మా దివస్ పేరిట మహబూబ్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. బజరంగ్ కార్యకర్తలు దేశంలోని అన్ని ప్రాంతాలలో గోరక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. దాంతో పాటు ఒక వర్గం వారు మహిళలను లవ్ జిహాద్ పేరిట చేస్తున్న మోసాలను బయటకు తీసుకువచ్చి మహిళలకు రక్షణ కల్పించడం జరుగుతుందన్నారు. రక్తదానం వల్ల ఆపదలో ఉన్న వ్యక్తుల ప్రాణాలు కాపాడే అవకాశం ఉందన్నారు. అందుకోసం కార్యకర్తలు క్రమం తప్పకుండా శిబిరాలు ఏర్పాటు చేసి రెడ్ క్రాస్‌లో నిల్వ చేయాలని సూచించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆలయంలో హనుమాన్ చాలీసా పరాయణం జరిగేలా కార్యకర్తలు చర్యలు చేపట్టాలన్నారు. అన్నివాడల్లో కమిటీలు వేసి హిందు వులను సంఘటితం చేసేందుకు బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు కృషి చేయాల ని అన్నారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన యువకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గోరక్ష ప్రముఖ్ సురేష్‌బాబు, చాపల హన్మంతు, జనార్దన్, చత్రపతి, శ్రావణ్, జయంత్, అయ్యప్ప, వంశీ, సంపత్, లయన్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న టీఎస్‌జీహెచ్ఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నూతనంగా ఎన్నికైన టీఎస్‌జీహెచ్ఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనంతప్ప, జగదీష్‌కుమార్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యేను కలిశారు. ఈసందర్భంగా ఆయనను సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలమూరు జిల్లాను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలన్నదే తన లక్ష్యమన్నారు. అందుకు విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. వచ్చే పది పరీక్షలలో వందశాతం ఫలితాలు సాధించేందుకు ప్రతీ ఒక్కరు దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అబ్దుల్‌హక్, రామకృష్ణ, రామలింగం, రామచంద్ర, రాజేశ్వర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం కాన్వాయ్ రాక.. స్తంభించిన చౌరస్తా

బాలానగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా 44వ జాతీయ రహదారి గుండా తన వాహన శ్రేణితో అతివేగంగా బయలుదేరారు. స్థానిక పోలీసులు ఇతర జిల్లాల పోలీసులు జాతీయ రహదారిపై గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కాన్వాయ్ వెళ్లిపోయే వరకు జాతీయ రాహదారిపైకి ఇతర వాహనాలు రాకుండా ట్రాఫిక్‌ను మళ్లించారు. కేవలం జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలను క్రమ పద్ధతిలో ప్రయాణం చేయడానికి అవకాశం కల్పించారు. సీఎం వాహన శ్రేణి వస్తున్నందున ముందస్తు సమాచారంతో ఇతర వాహనాలను దూరంగా నిలిపివేశారు. దీంతో బాలానగర్ చౌరస్తాలో 20 నిమిషాల పాటు రహదారిపై కేవలం పోలీసులు కనిపించారు. నిత్యం వాహనాల రద్దీతో కనిపించే చౌరస్తా ఈ సందర్భంగా నిర్మానుష్యంగా మారింది.

తీర్మానాల అమలుకు పోరాడుతాం

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు

జడ్చర్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జడ్చర్లలో రెండు రోజుల పాటు నిర్వహించిన సీపీఎం జిల్లా మహాసభలలో 17అంశాలపై తీర్మానం చేశామని, ఆ తీర్మానాల అమలుకు పోరాడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, రాష్ట్ర నాయకుడు కిల్లెగోపాల్ అన్నారు. జడ్చర్లలోని అంబేడ్కర్ కళాభవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతంగా నిర్వహించుకున్నామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు నిధులు కేటాయించి సత్వరమే పూర్తి చేయాలని, అలాగే ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, ఎన్నికల ముందు ప్రకటించిన ఆరుగ్యారెంటీ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. పాలమూరు యూనివర్సిటీకి రూ.500 కోట్లు కేటాయించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలు, కాలేజీలకు సొంత భవనాలను కేటాయించాలని తీర్మానం చేసినట్లు చెప్పారు. చర్మకారులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, రుణాలు మంజూరు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, రోస్టర్ పాయింట్ అమలు చేయాలని, ధరణి సమస్యలను పరిష్కరించాలన్న 17అంశాలపై తీర్మానం చేసినట్లు వివరించారు. అనంతరం సీపీఎం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా కార్యదర్శిగా రాములు, కార్యదర్శివర్గ సభ్యులుగా కిల్లెగోపాల్, కురుమూర్తి, కుర్మయ్య, పద్మ, 11మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో దీప్లానాయక్, జగన్, తెలుగు సత్తయ్య, నాగరాజు, శంకర్, శ్యాంసుందర్ ఉన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



మిడ్జిల్‌లో గెల్వమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

- మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి

మిడ్జిల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన వాటర్‌మెన్ యాదయ్య భార్య గెల్వమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో, విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి ఆదివారం గెల్వమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతకుముందు ఎంవీఎస్ గార్డెన్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్త గోవిందాచారి కుమార్తె వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఆయనవెంట మాజీ ఎంపీపీ సుదర్శన్, పీఏసీఎస్ చైర్మన్ కుచూరు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, నారాయణ్‌రెడ్డి, భాస్కర్, శ్రీనివాసులు, శేఖర్, కరుణాకర్‌రెడ్డి, ఆచారి, రాఘవేందర్, శ్రీనివాసులు, గోపాల్, భాస్కర్‌చారి, రామకృష్ణ, వరుణ్‌రాజ్, ప్రశాంత్, శేఖర్‌యాదవ్, జగదీష్, నర్సింహ ఉన్నారు.

రహదారికి ఇరువైపులా చెత్త

- దుర్వాసన వెదజల్లుతున్న మహబూబ్‌నగర్ -రాయచూర్ రోడ్డు

మహబూబ్‌నగర్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ రాయచూర్ జాతీయ రహదారికి ఇరువైపులా ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు భారీగా ఉన్నాయి. జాతీయ రహదారులపై పారుశుధ్య మూటలతో దర్శనమిస్తున వైనం మహబూబ్‌నగర్ జిల్లా మునిసిపాలిటీ పరిధిలోని బండమీదిపల్లి, రాజీవ్ గృహకల్ప, పట్టణానికి సమీపంలో ఉన్న ధర్మాపూర్, అల్లీపూర్ గ్రామ పరిసర ప్రాంతాలలో, దారుల వెంబడి పారిశుధ్య లోపం కనబడుతుంది. మహబూబ్‌నగర్ -రాయచూర్ రహదారికి రెండు వైపులా పలురకాల పదార్థాలతో కూడిన పారుశుధ్యం బస్తా సంచుల లో కుప్పలు కుప్పలుగా పడి ఉన్నాయి. అయినప్పటికీ మునిసిపాలిటీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణ కేంద్రంలోని చికెన్, మటన్ దుకాణం, ఉల్లిగడ్డ, అల్లంఎల్లిగడ్డ, బిర్యానీ సెంటర్ తదితర ఫాస్ట్‌ఫుడ్, వివిధ రకాల వ్యర్థ పదార్థాలను, ఇళ్లలో నిరుపయోగ వస్తువులు, పాతదుస్తులు, కుళ్లిన ఆహార పదార్థాలు, జంతు కళేబరాలు జాతీయ రహదారి పక్కనే సంచుల లో వేస్తున్నారు. దీనివల్ల దుర్వాసన వస్తుండడంతో వాహనదారులు ముక్కుమూసుకొని ప్రయాణిస్తున్నారు. చెత్త సేకరించేందుకు మునిసిపాలిటీ ట్రాక్టర్లు, ఆటోలు రాకపోవడం వల్లే ఈపరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రాయిచూర్ రోడ్డు పక్కనే కనిపిస్తున్న చెత్త